క్లుప్తంగా

ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా?



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలు

గుడిపాల: ప్రమాదమని తెలిసినా పట్టించుకోకుండా ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని వసంతాపురంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు చెట్ల కొమ్మలన్నీ నిలువుగా పెరిగినా ట్రాన్స్‌కో వారు పట్టించుకోవడం లేదు. దీంతో తరచూ ఈ గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఫీజ్‌లు ఎగిరిపోవడంతో కరెంట్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతోపాటు ఇక్కడ విద్యుత్‌లైన్లు చేతికి అందే ఎత్తులో ఉండడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఐటీఐకి దరఖాస్తు చేసుకోండి

విజయపురం: ప్రభుత్వ ఐటీఐ (పన్నూర్ సబ్ స్టేషన్ దగ్గర) 2024–25 సంవత్సరానికి గాను మిగిలిన సీట్ల భర్తీ మూడవ విడత దరఖాస్తులు స్వీకరించనున్న ఇన్‌చార్జి ప్రిన్సిపల్ లలిత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో కానీ, నేరుగా కానీ దరఖాస్తులను ఈ నెల 26వ తేదీ లోపు సమర్పించవచ్చని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 86397 90174, 63031 56450, 94944 34236, 91770 35120, 98853 20544ను సంప్రదించాలని కోరారు.

రథంపై అంకాళపరమేశ్వరి దర్శనం



ఊరేగుతున్న అంకాళపరమేశ్వరి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆడి అమావాస్యను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. రాత్రి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం సుందరమయంగా అలంకరించి రథంలో ఊరేగించారు. భక్తులకు కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు కేఎం కుమార్, అర్చకులు కుమార్‌లు ఉన్నారు.

సీఎస్‌ఐ చర్చిలో రక్తదాన శిబిరం

గుడిపాల: చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సిగ్న్ అండ్ షైన్ ట్రస్ట్, సీఎంసీ ఆస్పత్రి వారు సంయుక్తంగా నరహరిపేట సీఎస్‌ఐ చర్చిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 20మంది వరకు రక్తదానం అందించారు. సీఎంసీ డాక్టర్లు మాట్లాడుతూ రక్తదానం ఇవ్వడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండడానికి వీలుంటుందన్నారు. ఎవరూ అపోహలు వీడి రక్తాన్ని ఇవ్వడం వల్ల ఎదుటి వారి ప్రాణాలను కాపాడేందుకు వీలుంటుందన్నారు.

కాణిపాకంలో మాజీ మంత్రి వెంకటేష్



స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం మాజీమంత్రి టీ.జీ వెంకటేష్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆయన సిబ్బంది వాసు, విఘ్నేష్, నరసింహులు శెట్టి పాల్గొన్నారు.

అవస్థలు మళ్లీ మొదలు

గత ప్రభుత్వం సర్కారు బడులకు జీవం పోసింది. కార్పొరేట్ తరహా హంగులను తీసుకొచ్చింది. రంగులు అద్ది..హంగులు దిద్ది.. బడులకు ఊపిరిపోసింది. సకాలంలో పుస్తకాలు, యూనిఫామ్, బూట్లు అందించి, పేద పిల్లలు చక్కగా బడికొచ్చేలా తయారు చేసింది. వసతుల నుంచి విద్యాబోధనలో మార్పులు తీసుకొచ్చింది. అయితే నేటి ప్రభుత్వంతో బడులకు చంద్ర గ్రహణం పట్టుకుంది. బడుల అభివృద్ధికి అడ్డుపడింది. పేద పిల్లలు చదువుల ఒడిలో తడబడేలా చేస్తోంది. టీచర్లకు పాతాల కష్టాలను తెచ్చిపెట్టింది. కొత్తగా చేరిన పిల్లలకు యూనిఫామ్ అందలేదు. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. మధ్యాహ్న భోజనానికి పేరుమార్చి పాత మెనూలో నాణ్యత, రుచి తగ్గించేసింది. దీంతో సర్కారు బడుల్లో మళ్లీ అవస్థలు మొదలయ్యాయి.



మూడు తరగతులకు కలిపి పాఠాలు బోధిస్తున్న గంగసాగరంలోని ఉపాధ్యాయురాలు

- ఆగిన విద్యాకానుక పంపిణీ
- పిల్లలకు అందని యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు
- టీచర్లకు పాఠాల కష్టాలు
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- మధ్యాహ్న భోజనానికి పేరు మార్పు.. తగ్గిన నాణ్యత– రుచి

కాణిపాకం/చిత్తూరు అర్బన్: చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 502 ప్రాథమిక పాఠశాలలు, 78 ప్రాథమికోన్నత పాఠశాలలు, 122 జెడ్పీ ఉన్నత పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూల్స్ 5 ఉన్నాయి. ఇందులో 30,109 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే వీరికి బడుల్లో సమస్యలు చుట్టుముట్టాయి. మౌళిక వసతుల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదుల కొరత వేధిస్తోంది. పాఠాల బోధన గందరగోళంగా మారింది. ఉపాధ్యాయులు సైతం అయోమయంలో పడుతున్నారు. అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

వేధిస్తున్న టీచర్ల కొరత

ప్రభుత్వ బడుల్లో పిల్లలకు సంఖ్యకు తగ్గట్టు చాలా పాఠశాలలో టీచర్లు లేరు. ఇద్దరు టీచర్లు ఉండాల్సిన చోట ఒకరు మాత్రమే కనిపిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 748 మంది టీచర్లు పనిచేస్తున్నారు. 160 మందికి ఉపాధ్యాయులు కావాల్సి ఉందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఉపాధ్యాయుల కొరత కారణంగా ఏకోపాధ్యాయలతో అరకొర పాఠాలు బోధించే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వీరు సెలవు పెడితే ఆ పాఠశాలకు తాళం పడే దుస్థితి నెలకొంది. ఇక మరికొన్ని పాఠశాలలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేని కారణంగా రెండేసి, మూడేసి తరగతులకు ఒక ఉపాధ్యాయుడే పాఠాలు చెబుతున్నారు. పిల్లలకు తగ్గట్లు ఉపాధ్యాయులు లేకపోవడంతో పిల్లల ఆటలు తప్ప చదువుపై ధ్యాస పెట్టడం లేదు.

కొన్ని చోట్ల కానుకల్లేవు

గత ప్రభుత్వం హయాంలో పాఠశాలలు పునః ప్రారంభం నుంచే విద్యాకానుకలు ఇచ్చేవారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, షూ, టై వంటి వాటితో మరిన్ని బ్యాగుతో జత చేసి విద్యాకానుక అందించే వాళ్లు. దీంతో పేద పిల్లలు కార్పొరేట్ తరహాలో ఇష్టంగా బడికెళ్లేవాళ్లు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కానుక ఆలస్యమైంది. ఇప్పటికే వరకు చాలా పాఠశాలలో కానుకలు రాక పిల్లలకు యూనిఫాం అందలేదు. పాఠ్య పుస్తకాలు అందక కొనుక్కోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. చిత్తూరు మండలంలో 1వ తరగతి పిల్లలకు కానుకలు అందలేదు. ఐరాల మండలంలో 76 మందికి, తవణంపల్లెలో 2,505 మందికి, పూతలపట్టులో 108 మందికి కానుకలు ఇవ్వాలి ఉంది. అయితే ఎప్పుడిస్తారో తెలియక ఉపాధ్యాయులు, పిల్లలు తల్లిదండ్రులు అయోమయంలో పడుతున్నారు.

పూతలపట్టు నియోజకవర్గ వివరాలు	
ప్రాథమిక పాఠశాలల సంఖ్య –	297
ప్రాథమికోన్నత పాఠశాలలు –	35
జెడ్పీ ఉన్నత పాఠశాలలు –	42
రెసిడెన్షియల్ స్కూల్స్ –	02
చదువుతున్న విద్యార్థుల సంఖ్య –	17,975
మొత్తం టీచర్ల సంఖ్య –	534
టీచర్ల ఖాళీలు –	104
విద్యాకానుక ఇవ్వాల్సిన విద్యార్థుల సంఖ్య –	2,689

చిత్తూరు నియోజకవర్గ వివరాలు	
ప్రాథమిక పాఠశాలలు –	205
ప్రాథమికోన్నత పాఠశాలలు –	22
జెడ్పీ పాఠశాలలు –	39
రెసిడెన్షియల్ స్కూల్స్ –	03
విద్యార్థులు –	12,134
టీచర్ల సంఖ్య –	214
టీచర్ల ఖాళీల సంఖ్య –	56
విద్యాకానుక ఇవ్వాల్సిన విద్యార్థుల సంఖ్య –	1,812

మెనూ మారలేదు -నాణ్యత తగ్గింది

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పిల్లలను బడికి రప్పించే ప్రయత్నంతో పాటు వారికి మంచి పౌష్టికాహారం అందించి, ఆరోగ్య రక్షణకు నాంది పలికింది. మధ్యాహ్న భోజనం అందించడంలో నాణ్యత, రుచికరంగా ఉండేలా చర్యలు చేపట్టింది. తద్వారా ప్రభుత్వ బడిలో మధ్యాహ్న భోజనం తినే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. నిత్యావసర సరుకుల ధరలు పెరిగినా మధ్యాహ్న భోజన విషయంలో నాణ్యత, రుచి తగ్గకుండా పిల్లలకు భోజనం వడ్డించేవాళ్లు. అది కూడా పాఠశాలలోనే వండి తాజాగా వడ్డించేవాళ్లు. అయితే చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక మళ్లీ పలు చోట్ల ఇంట్లో వంట వండి తీసుకొస్తున్నారు. ఇందులో రుచీపచీ లేదని, నాణ్యత కొరవడింది. ప్రస్తుతం నిత్యావసర ధరలతో పాటు కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దీంతో సాంబారులో కూరగాయలు కనిపించడంలేదు. మధ్యాహ్న భోజనంలో పప్పు పవిత్రంగా మారింది. ఈ ప్రభుత్వం పథకం పేరును మాత్రమే మార్చిందని, గతంలో అమలవుతున్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డిస్తోంది. అయితే పర్యవేక్షణ లోపం కారణంగా ఈ మోనూ, ముఖం చాటేస్తోందని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదు. పర్యవేక్షణ పూర్తిగా లోపిస్తోంది. పిల్లలు కూడా పూర్తిగా క్రమశిక్షణ తప్పుతున్నారు. బోధనలో కూడా ఉపాధ్యాయులు, పిల్లలు సైతం దాంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి పిల్లలకు విద్య అందించాలి.

–ఎల్లప్ప, తగ్గువారిపల్లె, బంగారుపాళెం మండలం

అన్సర్ మరణం పార్టీకి తీరని లోటు

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేసిన అన్సర్(61) ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలోని పాత సంతవీధికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అన్సర్ ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న నారాయణస్వామి అన్సర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. అన్సర్ మృతి విషయం తెలిసి జీడీనెల్లూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కళత్తూరు కృపాలక్ష్మి ఫోన్‌లో వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం నిత్యం పోరాటం చేసిన అన్సర్ ఇక లేరన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నామని తెలిపారు. పార్టీ తరఫున అన్నివిధాలా వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, సోషల్ మీడియా మండల కన్వీనర్ రఫీ, ఆర్.సుబ్రమణ్యం, ధనయాదవ్, మణి తదితరులు ఉన్నారు.



అన్సర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పేదల సేవకే లయన్స్ క్లబ్

పుంగనూరు: పేద ప్రజలకు విశేష సేవలందించేందుకే లయన్స్ క్లబ్ నిరంతరం కృషి చేస్తోందని క్లబ్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ పి.శివ తెలిపారు. ఆదివారం సాయంత్రం క్లబ్ కార్యాలయంలో బెంగళూరుకు చెందిన క్లబ్ మాజీ గవర్నర్ భక్తవత్సలరెడ్డి, జోన్ చైర్మన్ సుబ్బారెడ్డి, అరుణ్‌కుమార్, గోపీకృష్ణలతో కలసి పేదలకు కుట్టుమిషన్లు, గొడుగులు, విద్యార్థులకు బెడ్‌షీట్లు, ఆస్పత్రికి డయాలసిస్ మిషన్, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు పంపిణీ చేశారు. అలాగే పదోతరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. డాక్టర్ శివ మాట్లాడుతూ క్లబ్ ద్వారా రూ.5 లక్షలు విలువ చేసే వస్తువులను 125 మందికి పంపిణీ చేశామని వెల్లడించారు. అలాగే ప్రజారోగ్య రక్షణకు వైద్యశిబిరాలు, మూగజీవుల కోసం పశువైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామి వివరించారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి, ప్రతినిధులు గోపాలకృష్ణ, వరదారెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజారెడ్డి, రఘుపతి, సురేష్, రిజ్వి, మహేంద్రరావు, సుధాకర్, వేణుగోపాల్, సీవీ రెడ్డిప్రసాద్, జి.వేణుగోపాల్, ఎస్‌ఆర్.సతీష్‌కుమార్, పి.మల్లికార్జునరెడ్డి, జి.రవికుమార్ పాల్గొన్నారు.



వస్తువులు పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రతినిధులు

విద్యార్థులకు తెలుగు భాషా పోటీలు

పలమనేరు: రానున్న తెలుగు భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు జాతీయస్థాయి తెలుగుభాషా పోటీలను నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6, 7 తరగతులకు తెలుగుభాష గొప్పతనం, 8 నుంచి 10 తరగతుల వారికి నేటి తెలుగుభాష దుస్థితి అనే అంశంపై మూడు పేజీలకు మించకుండా వ్యాసం రాసి ఈనెల 15లోపు తులసీనాథం నాయుడు, కళామందిరం, సాయిగార్డెన్ సిటీ, గంగవరం అనే చిరునామాకు పోస్టాఫీస్ ద్వారా మాత్రమే పంపాలని సూచించారు. వందకుపైగా నీతి పద్యాలను చెప్పే వారికి ప్రత్యేక బహుమతులుంటాయని అందులో పేర్కొన్నారు. వివరాల కోసం 9553429770 అనే నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

స్వీట్ కార్న్‌కు భలే డిమాండ్

- కోళ్ల దాణాలో అధిక వినియోగం
- విస్తరిస్తున్న మొక్కజొన్న సాగు
- రబీ సీజన్ అనుకూలం



సాగులో ఉన్న మొక్కజొన్న పంట

ఐరాల/పూతలపట్టు: మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పోషకాలు మెండుగా ఉన్న ఈ మొక్కజొన్నను కోళ్లు, పశువులకు అందించే దాణాలో ఎక్కువగా వినియోగిస్తారు. ఐరాల, పూతలపట్టు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ఈ మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. ఇందులో స్వీట్ కార్న్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ఇందులో ఫైబర్ అధికంగా ఉండడంతో రోజువారీ ఆహారంలో దీన్ని భాగం చేసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు. రెండు మండలాల్లో పదేళ్ల క్రితం పదెకరాలు మాత్రమే సాగయ్యే ఈ మొక్కజొన్న పంట ఇప్పుడు ఏకంగా 200 ఎకరాల వరకు సాగవుతోంది. ఈ నేపథ్యంలో సాగులో మెలకువలు తెలుసుకుంటే లాభదాయకంగా ఉటుందని మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ మండలాల్లో సుమారు 80 ఎకరాల్లో మొక్కజొన్నతోపాటు స్వీట్ మొక్కజొన్న పంట సాగు చేశారు. ఇది ప్రధానంగా రబీ కాలంలో అక్టోబర్ నుంచి జనవరి మధ్యలో విత్తుకోవడానికి అనుకూలమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఈ రకాలు మేలు

మాధురి: మొక్కజొన్నలో ఈ రకం విత్తనాలు సాగు చేస్తే 60 నుంచి 75 రోజుల్లో దిగుబడి వస్తుంది. ఎకరాకు 25 నుంచి 26 వేల పొత్తులు (కండెలు)వస్తాయి. 20 శాతం చక్కెర ఉన్నందున తినడానికి రుచిగా ఉంటాయి. ఈ పంట ద్వారా ఎకరాకు ఐదు నుంచి ఏడు టన్నుల పశుగ్రాసం లభ్యమవుతుంది.

ప్రియ: ఈ రకం 65 నుంచి 80 రోజుల్లో దిగుబడి వస్తుంది. ఎకరాకు 28 నుంచి 30 వేల కండెలు వస్తాయి. 20 నుంచి 22 శాతం చక్కెర కలిగి తినడానికి చాలా మధురంగా ఉంటాయి. ఈ రకం సాగు చేయడం ద్వారా ఎకరాకు ఆరు నుంచి ఎనిమిది టన్నుల పశుగ్రాసం లభ్యమవుతుంది.

నేల రకం: ఈ మొక్కజొన్న పంట సాగుకు సారవంతమైన నేలలు అంటే నీరు ఇంకే నేలలు అనుకూలంగా ఉంటాయి. ఒండ్రు మంటి కలిగిన ఇసుక నేలల్లోనూ బాగా పండుతుంది. నీరు నిల్వ ఉన్న, చౌడు భూములు మాత్రం అనుకూలం కాదు.

సాగు చేసే పద్ధతి ఇలా

- మొక్కజొన్న విత్తడానికి ముందు రెండు, మూడు సార్లు నాగలితో బాగా దుక్కి చేయాలి.
- ఆఖరి సారి దుక్కిలో ఎకరాకు పది టన్నుల పశువుల ఎరువు కానీ, కోళ్ల ఎరువు కానీ వేసి బాగా కలియదున్నాలి.
- ఎకరాకు నాలుగు కిలోల విత్తనం సరిపోతుంది.
- నీటి పారుదల సులభంగా ఉండే విధంగా విత్తుకోవాలి.
- ఈ పంటకు కలుపు నివారణ చాలా అవసరం.
- విత్తిన వెంటనే అట్రజిన్ పొడి మందు ఎకరాకు కిలో చొప్పున 200లీటర్ల నీటిలో కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేసినట్లయితే నెల వరకు కలుపు మొక్కలను నియంత్రించవచ్చు.
- విత్తిన నెల రోజుల తర్వాత వెడల్పాటి ఆకులు కలిగిన కలుపు మొక్కలు కనిపిస్తే 2.4 డిసోడియం సాల్ట్ 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- ఎకరాకు 65 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాష్‌ను వేయాలి.
- పైరుకు నేల స్వభావాన్ని బట్టి 4 నుంచి 6 తడులు నీరు కట్టాలి.
- 30 నుంచి 40 రోజుల్లోపు ఉన్న లేతపైరుకు అధిక నీరు పెట్టకూడదు.
- పంటకోత ఆలస్యమైతే మొక్కజొన్నలో చక్కెర శాతం తగ్గుతుంది.
- వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఉదయం గానీ సాయంత్రం గానీ కోత చేపట్టాలి.

తెగుళ్ల బెడద – రక్షణ

కాండం తొలుచు పురుగు: ఈ పురుగులు మొలకెత్తిన 10 నుంచి 20 రోజుల్లో పంటను ఆశిస్తాయి. పిల్ల పురుగు మొదటి ఆకులపైన పత్ర హరితాన్ని గోకి తింటుంది. తర్వాత ముడుచుకుని ఉన్న ఆకు ద్వారా కాండం లోపలకు ప్రవేశిస్తోంది. ఈ ఆకులపై గుండు సూది మాదిరిగా రంధ్రాలు గానీ, పొడవాటి చిల్లులు కానీ వరుస క్రమంలో కనిపిస్తాయి. దీనివల్ల మొక్క చనిపోయి ఎండిపోతుంది. తద్వారా దిగుబడి తగ్గుతుంది. దీని నివారణకు పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. పొలం చుట్టూ మూడు వరుసల్లో జొన్న పంటను ఎర పంటగా వేసి 45 రోజుల తర్వాత తీసివేయాలి. విత్తనం నాటిన 20 రోజుల్లో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే 3 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గులికను ఆకుల సుడుల్లో వేయాలి.

ఆకు ఎండు తెగుల నివారణ: తెగులు సోకిన మొక్కజొన్న ఆకులపై కోల ఆకారంలో గోధుమ వర్ణపు మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలు మొదటి కింది ఆకులపై కనిపించి పెద్దవై ఆకులపై కూడా వ్యాపిస్తాయి. వాతావరణంలో అధిక తేమున్నప్పుడు ఆకు అంతా ఎండిపోయి మొక్కలు చనిపోయినట్లు కనిపిస్తోంది. దీని నివారణ కోసం మాంకోజెబ్ పొడి మందును ఎకరాకు 500 గ్రాములు 200లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి రెండు సార్లు పిచికారీ చేయాలి.

ఎండుతున్న వేరుశనగ



వేరుశనగ ఎండుముఖం పట్టింది. ఖరీఫ్ ఆరంభంలో తొలకరి జల్లులకు రైతులందరూ వేరుశనగ పంట సాగు చేశారు. జూన్‌లో మోస్తరుగా కురిసిన వర్షాలకు పంట ఎదుగుతూ వచ్చింది. అయితే జూలైలో వర్షాలు పడకపోవడంతో వేసిన పంట అంతా ఎండిపోతోంది. గుడిపాల మండలంలో ఈ సారి 1,221 ఎకరాల్లో వేరుశనగ సాగుచేశారు. సకాలంలో వర్షాలు పడకపోవడంతో పంట మొత్తం వాడిపోతోంది. అప్పులు చేసి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో ఎండిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– గుడిపాల

కార్పొరేషన్ కార్యాలయంలో నేడు గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే నిర్వహించనున్నట్లు కమిషనర్ జె అరుణ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. సంసంబంధిత అధికారులు అందుబాటులో ఉండాలని కోరారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నేడు ధర్నా

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలని కోరుతూ సోమవారం అన్నమయ్య జిల్లా సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎన్‌ఆర్ అశోక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో శ్రీనివాసులు, నాగరాజా, రమేష్, ఆనంద, రెడ్డెప్ప, ఈశ్వర్, శీన పాల్గొన్నారు.